


# అర్థంకానిది

- చావా శివకోటి

మా పక్క పోర్షన్‌లో 'కల్పన' అనే స్కూలు టీచరుండేది. అసలు ఆవిడ చదువు కోసమే - కల్పన తల్లి సుభద్రమ్మ - వున్న పల్లెలో వున్నంత మేరకు అమ్మేసుకొని టౌనుకొచ్చింది! మా ఇంట్లోనే రెండు గదుల పోర్షను ఖాళీగా వుండడాన అద్దెకిచ్చాం. అప్పటి నుంచీ మా పక్కనే వుంటూ వచ్చారు. కల్పన బిఎస్సీ పాసయింది. ఆ తరువాత బి.ఇడి.,కి వెళ్ళింది. అదీ పూర్తి చేశాక ఉద్యోగాల వేటలో పడింది. గవర్నమెంటు జాబు కోసం వెతుకుతూనే- ఓ ప్రైవేటు స్కూలులో - టీచరుగా చేరింది.

రోజూ సాయంత్రం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటలదాకా 'సైన్సు' సబ్జెక్టు ట్యూషన్ చెప్పేది. ఇక్కడికి కూడా దాదాపు నలభై యాభై మంది వచ్చి చదువుకునే వారు. మాకే ఒక్కోసారి 'ఏమిటీ చికాకు' అనిపించేది. కానీ, ఆ తల్లీ బిడ్డల మంచితనం, కలుపుగోలుతనం వల్ల ఏమీ అనలేక పోయేవాణ్ణి. ఒకనాడు కల్పన సంతోషంగా ఇంటికి తిరిగి వచ్చి "యాజులు గారూ- నాకు ఉద్యోగం వచ్చింది" అంది.

"శుభం తల్లీ - మంచి మనసుంటే చాలు - ఆ భగవంతుడు కూడా చల్లగానే చూస్తాడమ్మా" అని, "సుభద్రమ్మా, సుభద్రమ్మా అమ్మాయి నోట్లో ఇంత బెల్లం ముక్క పెట్టు. చల్లటి వార్త తెచ్చింది" అని పెద్దగా పిలిచి చెప్పాను. నాకూ అంత సంతోష మనిపించింది.

తల్లి పరుగున వచ్చి ఆ వార్త విని, సంతోషించి దిష్టి తీసి పారేసింది.

ఆ రాత్రి నాకెందుకో అనుమానమొచ్చి "అమ్మా, కల్పనా నిన్ను ఎక్కడికి వేశారు" అడిగాను.

"బండిపాలెం" అంది.

"ఫరవాలేదు, అరవై పైసల టిక్కెట్టు" అనుకున్నాను. ఆ తరువాత ప్రైవేటు స్కూలులో రాజీనామా ఇచ్చింది కల్పన. ట్యూషన్లు మాత్రం చెబుతూనే వుంది. బండిపాలెం స్కూలులో ఎనిమిది మంది స్టాఫ్ వున్నారు. అక్కడ పనిచేస్తున్న రోజులలో ఆ ఊరి కుర్రాడొకడు ఎక్సయిజ్ ఎస్.ఐ.గా సెలక్టు అయ్యాడు. అతగాడి పేరు రఘు. బస్సుస్టాండ్‌లో కల్పనకూ, రఘుకు ఒకసారి పరిచయమైంది. అదీ ఎలాగంటే స్కూలు స్టాఫ్‌లోని మురళీకి ఆ రఘు బావమరిది. అందువల్ల పరిచయం చేశాడు. వీరి పరిచయం కొద్ది కొద్దిగా ముదిరి ఒకరికొకరు ఆకర్షితులయ్యారు. ఒకనాడు, రఘు, కల్పన కలిసినప్పుడు మామూలు పలకరింపులు పూర్తి అయ్యాక, "ఒక నెలలో నేను ఉద్యోగంలో చేరుతున్నాను, ఆలోపు పెళ్లి చేసుకొమ్మంటున్నారు మావాళ్ళు" అన్నాడు నవ్వుతూ.

"మీకేం? ఉద్యోగముంది! అంతో ఇంతో స్థిరాస్తి వుంది! పైగా బాగానే వుంటారు! అందువల్ల 'నేను పెళ్ళికి సిద్ధమే' అని చెప్పేయండి చాలు. ఆడ పిల్లల తండ్రులు ఎంతో కొంత దండిగానే ముడుపు పట్టుకొని క్యూలో హాజరవుతారు" అంది నవ్వి.

"మీకు పెళ్ళి చేసుకోవాలనే ఆలోచన లేదా?" అడిగాడు రఘు.

"ఉంది, కానీ ఓ లక్షయినా నా దగ్గర వుండాలి గదా! వరుడెప్పుడూ పిల్ల బావుండాలి, ఉద్యోగమూ వుండాలి, అంతో ఇంతో డబ్బు ఇవ్వాలి, లాంఛనాలు దండిగా జరపాలని అని చూస్తాడు. ఇదీ ఆ

పటిష్ఠమైన కట్టడాలకు
చిరకాల మన్నికకు
భీమ సిమెంట్

సమాజం ఎప్పుడు మారుతుందో ఏమో'' అంది.

''మనం మార్చే ప్రయత్నం వేయొచ్చు కదా'' అన్నాడు కొంటెగా చూస్తూ.

''ఒక్క మనతో ఏదీ మారదు! సామాజికంగా ఈ మార్పు రావాలి.''

''ఒకరితో మనకేం కాని కల్పనా - నువ్వు పరేవంటే - నీ ఆస్తి పాస్తులతో సంబంధం లేకుండా నిన్ను పెళ్ళాడాలని వుంది! అదీ నీకు మనస్ఫూర్తిగా ఇష్టమైతేనే'' అన్నాడు కళ్ళలోకి చూస్తూ-

ఒకసారి సీరియస్‌గా చూసింది కల్పన. ఆ తరువాత ఆడపిల్లలా తలదించుకొంది. ఒక్క క్షణం ఆగి 'నన్ను ఆలోచించుకోనివ్వండి' అని-

''మీరూ మరోసారి ఆలోచించుకోండి. తొందరపాటు వల్ల - మంచి కంటె చెడే ఎక్కువ జరుగుతుందని నా భావన'' అని వెళ్ళిపోయింది.

మూడో రోజు రఘు కల్సినప్పుడు కల్పనే అడిగింది.

''ఏం ఆలోచించుకున్నారు'' అని.

''నా నిర్ణయంలో మార్పు లేదు. నీ మాట కోసమే ఎదురుచూస్తున్నాను'' అన్నాడు.

''అలా అయితే- నాకూ ఇష్టమే'' అని''ఇక నా వివరాలు చెప్తాను - వినండి నాకు మా అమ్మ వుంది, నాన్న లేదు. ఆవిడ మనతో వుంటే మీకెలాంటి అభ్యంతరం లేదు కదా?'' అంది.

''వేరే వుండకూడదా?'' అన్నాడు రఘు.

''వుంటుంది. కానీ- నేను తప్ప ఆవిడకెవ్వరూ లేరు. నన్ను చూడనిదే వుండలేదు. నా చదువు కోసం వున్నదంతా అమ్ముకొని ఇక్కడికొచ్చింది. ఎన్ని కష్టాలో పడి చదివించింది, నన్నిలా తీర్చి దిద్దింది. అంచేత నాకామె ప్రాణం, దైవం కూడా! అయితే ఆవిడకు మన వెంట వచ్చి వుండాలనే ఆశ లేదు. నేనే అడుగుతున్నాను మీ అభిప్రాయం తెలుసుకుందామని'' అంది.

నవ్వాడు, సమాధానం మాత్రం చెప్పలేదు. మొదట చెప్పిందే భాయమేమో.

''ఇక నా దగ్గర నలభై వేల రూపాయిలున్నాయి! అమ్మ దగ్గర వున్న డబ్బు మాత్రం నా పెళ్ళికి సరిపోతుంది'' అంది.

''నీ దగ్గర ఎంత వున్నా- నాకెందుకు?'' అన్నాడు నవ్వి.

''మనం వెంటనే వేరుగా వుండాల్సి వస్తుందా? మీ ఇంట్లో వుండాలా?''

''అది ఇంకా తేలలేదు! నువ్వు సరే అన్న తరువాత ఆ విషయం ఆలోచిస్తాను'' అన్నాడు.

''అయితే మిమ్మల్ని పెళ్ళాడడానికి నాకెలాంటి అభ్యంతరమూ లేదు'' అంది సిగ్గుపడుతూ.

ఆ తరువాత రఘు అక్కడ కనిపించలేదు పరుగెత్తాడు.

కల్పన పెళ్ళి చాలా బాగా జరిగింది. హనీమూన్ పేరుతో అజంతా ఎల్లోరాలూ, పూనా, బొంబై తిరిగి వచ్చారు దంపతులు.

వేరింటి కాపురం పెట్టారు. అన్నీ సామాన్లనూ అమర్చుకొని, ఎవరి ఉద్యోగాలకు వారు పోతూ చాలా సుఖంగా వుంటున్నారు.

నెల గడిచి పోయింది క్షణంలా కొత్త దంపతులకు రఘు ఒక నాడు బాగా తాగి వచ్చాడు.

అప్పుడు మాటాడ లేదు కల్పన. ఆ స్థితిలో పక్కలోకి రమ్మన్నా కిమ్మనక వెళ్ళి భరించింది.

తెల్లారాక - ''అలా తాగి ఇంటికి రావచ్చా?'' అనడిగింది కల్పన అందుకు నవ్వి ''తాగినా తాగక పోయినా నేను వుండేదిక్కడనే గదా!'' అన్నాడు, అదేమీ తప్పుకానట్టుగా మొఖం పెట్టి.

''తాగడం తప్పు అనిపించ లేదా మీకు?'' అంది తిరిగి రెట్టిస్తూ.

''నేను పని చేస్తున్న డిపార్ట్‌మెంటే అది. నా చుట్టురా వుండేది సారాయికి సంబంధించిన కాంట్రాక్టర్సే! నేను తిరుగాడేదీ దాంట్లోనే అంచేత తప్పడం లేదు'' అన్నాడు.

''ఆముదంలో పని చేసే వాడు దాన్ని తాగి - పెస్టిసైడ్స్ తయారు చేసే వాడు దాన్ని తాగి, మందులు తయారు చేసే వాడు దాని తాగి - స్కాచ్ చేసే వాడు దాన్ని తాగితే స్కాచ్ జీతం వస్తుందా? ఈ వచ్చే జీతం మన కుటుంబానికి ఆధార భూతమవుతుంది. అంతే కానీ'' అం టూండగా ''కల్పనా ప్లీజ్... షటప్'' అన్నాడు లేస్తూ.

''నోరు మూసుకొనేంత తప్పు నేనేం చేసానో చెప్పండి'' అంది కల్పన నిలదీస్తూ.

''నేనింతే. నా నుంచి మార్పును కోరుకోవద్దు! ఇక పైన ప్రశ్నించ వద్దు, నువ్వేమిటి? ఎలా వున్నావు?' అని నేనింత వరకు నిన్నడగ లేదు, నువ్వూ నన్ను ప్రశ్నించకు'' అంటూ వెళ్ళి పోయాడు. అది మొదలు తాగుడు విపరీతమైంది. ఇంటికి రావడానికి - వెళ్ళి పోవడానికి టైం లేదు. అసలు తనకే తెలిసేది కాదు, నేనూ ఒక నాడు మందలించాను.'' ''అసలు నువ్వెరు?'' అన్నట్టుగా చూసి - వెళ్ళిపోయాడు - నాకు తల తీసేసినట్లు యింది.

ఒక నాడు నేను బయట వాలు కుర్చీలో కూర్చుని చదువుకుంటుండగా కల్పన తలుపులు తెరచుకొని గాబరగా బయటకు పరుగెత్తుకొచ్చింది. వంటిపై లంగా తప్ప చీరలేదు! ఉలిక్కి పడ్డట్టుగా నేను లేచాను.

''ఏంమ్మా'' అంటూ నా చాటున భయంగా దాక్కుంది.

''ఇప్పుడు టైమెంత? పగలు రెండు గంటలు, రెండున్నరకు నేను స్కూలుకెళ్ళాలి. నన్ను పక్కెక్కమని తాగి వున్న తిమ్మిరిలో బలవంతం చేస్తున్నాడు. నా మాట వినిపించుకొనే స్థితిలోలేడు పైగా వంటి మీద నూలు పోగయినా లేకుండా అసహ్యంగా నిల్చుని వున్నాడు. 'ఇతనితో ఎలాగో అర్థం కావడం లేదు'' అని కంట తడి పెట్టుకుంది. ఇంతలో తలుపు దాకా తూలూతు వచ్చి ఆగి ''కల్పనా, రా అనికేక లేయసాగాడు.

నేను కల్పనను నా ఇంట్లోకి తీసుకెళ్ళి - నా భార్య చీర ఇచ్చి స్కూలుకు పంపాను. అతనలాగే ఓ గంట సేపు ఇంట్లో రంకెలు వేసి ఏ మూలనో పడి పోయి నిద్ర పోయి వుంటాడు.

ఆరు మాసాలు ఇలాగే గడిచాయి ఇతని బాధకు ట్యూషన్లుచెప్పడం మానుకుంది. ఒకనాడు తెల్లవారు ఝామున కల్పన తలుపుకొడితే లేచాను. చేతుల నిండా 'రక్తం' వుంది. నాకు భయమేసింది. ''ఏం జరిగిందమ్మా'' అనడిగాను. లోపలకు చూపించింది భయంగా వణుకుతూ నేను అటుగా చూసాను. రఘు కొన ఊపిరివిడుస్తూ కనిపించాడు. ఏం జరిగిందన్నాను. ''తాగుడే కాక ఏవో మాత్రలు మింగి మూడు గంటల నుంచి చిత్ర హింసలు పెడుతున్నాడుట పారి పోబోతే కొట్టి మరీ ఆక్రమించుకున్నాడు. వంటింట్లోకిపరుగెత్తాను. అయినా వెంట పడి వదల లేదు. ఏం చేయాలో తోచి చావనూ లేదు! కత్తి పీట దొరికింది! దగ్గరికొస్తే చస్తావు' అన్నాను. అయినా వచ్చాడు. నేను కత్తిపీట విసిరాను. అరుస్తూ క్రింద పడి పోయాడు. నేను బలవంతంగా గుంజినా అది -ఆయన శరీరం నుంచి ఊడి రావడం లేదు'' అంది ఏడుస్తూ

నాకు కాలూ చెయ్యి ఆడ లేదు. పోలీసు లొచ్చారు. కల్పనను అరెస్టు చేసారు. భర్తను చంపిన హంతకి అని పేపర్లు వ్రాశాయి.

జీవిత ఖైదు పడింది. ఈ వార్త విన్న సుభద్రమ్మ గుండె ఆగి మరణించింది.

కల్పనకు మిగిలిన నా అన్నదిక్కు కూడా పోయింది.

ఇదంతా నా కళ్ళెదురుగా జరిగింది, అయితే ఇంత మంచి తల్లీ కూతుళ్ళకు పడాల్సిన శిక్షేనా ఇది? ఇందులో వాళ్ళ దోషం ఏమిటి? అన్నది మాత్రం అర్థం కాలేదు.

ఒక్కసారి మీరూ ఆలోచించి చూడండి.

నేను మాత్రం జరిగింది జరిగినట్టు రాశాను. ◆